క్లుప్తంగా

'జగనన్న సురక్ష' క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలి



అంగరలో సర్వే తీరును పరిశీలిస్తున్న తహసీల్దార్ సూర్యారావు

కపిలేశ్వరపురం: ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలని తహసీల్దార్ కొమరం సూర్యారావు గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. జూలై 3 నుంచి 26 వరకూ గ్రామాల్లో నిర్వహించతలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంపై తహసీల్దార్ సూర్యారావు బుధవారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. అంగర, కాలేరు, నేలటూరు, పడమర ఖండ్రిక గ్రామాల్లో అవగాహన సమావేశాల్లో వారు పాల్గొని సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

పూడిక తొలగింపు



డ్రైన్లలో పూడికను తొలగిస్తున్న కార్మికులు

కపిలేశ్వరపురం: కోరుమిల్లి–2 సచివాలయం పరిధిలోని డ్రైన్లలో పేరుకుపోయిన పూడికను బుధవారం పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. గ్రామంలో పారిశుద్ధ్య పరిరక్షణలో భాగంగా వీధుల్లోని చెత్తను, డ్రైన్లలోని పూడికను తొలగించి దూరపు ప్రాంతానికి తరలించారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో గ్రామస్తులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సూచించారు.

పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయం



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కామన తదితరులు

మండపేట: దేశ అభివృద్ధికి ఎనలేని సేవలందించిన భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు చిరస్మరణీయుడని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కొనియాడారు. పీవీ నరసింహారావు జయంతిని కామన ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి కామన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. మగ్గం జాకబ్ రాజు, కొడవళ్ల సుబ్బారావు, పిల్లి అప్పన్న, కొండ దుర్గారావు, కొమ్మోజు ప్రకాష్, కాకరపర్తి రాంబాబు తదతరులు పాల్గొన్నారు

మంత్రి వేణు పరామర్శ

రామచంద్రపురం: స్థానిక ఒకటో వార్డు గృహసారథుల కన్వీనర్ వైట్ల రామకృష్ణ తల్లి సుబ్బాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బుధవారం పరామర్శించారు. పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ కుడిపూడి లలితాగణేష్, నేతలు గుణ్ణం రామకృష్ణ, చింతపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

1న గురుకుల ప్రవేశ పరీక్ష

రామచంద్రపురం రూరల్: ఆదివారపుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 6 నుంచి 8వ తరగతి వరకూ మిగిలిన సీట్ల భర్తీకి జూలై 1వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎస్వీ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 వరకూ నిర్వహించే పరీక్షకు అభ్యర్థులు ఆధార్ కార్డుతో సకాలంలో హాజరు కావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరు కావాలని ఆయన వివరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మలికిపురం: చింతలమోరికి మోరి మీదుగా వెళుతున్న ప్రైవేట్ విద్యా సంస్థ బస్సు ప్రమాదానికి గురైంది. రోడ్డు మార్జిన్‌లోని ఓ షాపును ప్రమాదవశాత్తు ఢీకొంది. బస్ ముందు భాగం కొంత మేర దెబ్బతింది. అయితే బస్సులోని పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సఖినేటిపల్లి పోలీసులు తెలిపారు.

చింతలమోరిలో జేసీ పర్యటన

మలికిపురం: చింతలమోరిలో జేసీ ధ్యానచంద్ బుధవారం పర్యటించారు. టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకునే చర్యల్లో భాగంలో ఆయన పర్యటన సాగింది. ఇందుకు సంబంధించి స్థల సేకరణ చేయాలని తహసీల్దార్ నరసింహారావును ఆదేశించారు. సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మండపేటలో నాట్లు వేసేందుకు పాలాలను సిద్ధం [illegible] చేసుకుంటున్న రైతులు

ఖరీఫ్ జోరు

- తొలకరి పనుల్లో రైతులు బిజీబిజీ
- జోరందుకుంటున్న వరినాట్లు
- 80 శాతం స్వర్ణ రకం సాగు

మండపేట: తొలకరి రాకతో ఖరీఫ్ పనులు జోరందుకుంటున్నాయి. ముందుగానే కాలువలకు నీరు విడుదల కావడం, వర్షాలు మొదలవడంతో రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. దమ్ములు చేయడం, నాట్లు వేయడం తదితర వ్యవసాయ ముమ్మరం చేస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని 95,000 ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేయనున్నారు. రెండు నియోజకవర్గాల్లో 121 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం అందజేస్తోంది. నవంబరులో వచ్చే తుపానుల బెడద నుంచి పంటను కాపాడేందుకు ఈ సీజన్‌లో వ్యయసాయ శాఖ ముందస్తు సాగు చేపట్టింది. అందుకోసం జూన్ ఒకటో తేదీన కాలువలకు నీటిని విడుదల చేసింది. మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం ప్రాంతాల్లో ఇంజిన్లపై నారుమడులు సిద్ధం చేసిన మేర ఇప్పటికే నాట్లు మొదలుపెట్టారు. కాలువల నీటిపై నారుమడులు పోసిన చోట రైతులు పనులు ముమ్మరం చేస్తున్నారు. దమ్ములు చేయడం, పారలంకలు వేయడంలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. సాధారణంగా దాళ్వాలో వెదజల్లుకు రైతులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తుంటారు. కోవిడ్ అనంతరం కూలీల కొరత ఏర్పడడంతో గత మూడు సీజన్ల నుంచి తొలకరిలోను వెదజల్లు విధానానికి ప్రాధాన్యమిస్తున్నారు. గత సీజన్‌లో 15 శాతం విస్తీర్ణంలో వెదజల్లు తరహాలో సాగుచేస్తే ఈసారి రెట్టింపు స్థాయిలో సాగు జరుగుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు.

తుపాన్ల తప్పించుకునేందుకు..

ఖరీఫ్ సాగులో 80 శాతం మేర స్వర్ణం రకం సాగు చేస్తుండగా, మిగిలిన విస్తీర్ణంలో 1121, 1318 తదితర రకాలను సాగుచేస్తున్నారు. జూలై రెండో వారం నాటికి నాట్లు పూర్తి చేసుకోవడం ద్వారా అక్టోబరు నెలాఖరవు నాటికి కోతలు పూర్తవుతాయి. దీనివల్ల నవంబర్‌లో వచ్చే తుపానుల బెడద నుంచి పంటను కాపాడుకోవచ్చునని వ్యవసాయాధికారులు అంటున్నారు. డిసెంబరు చివరి నాటికి రబీ నాట్లు వేసుకుని మార్చి నెలాఖరవుకు కోతలు కోయడం ద్వారా మూడో పంటగా అపరాల సాగుకు మార్గం సుగమమవుతుంది. భూసారం పెరగడంతో పాటు రైతులకు మూడు నుంచి నాలుగు బస్తాల అదనపు దిగుబడి వస్తుందని వారు సూచిస్తున్నారు.

నారుమడి యాజమాన్యం పాటించాలి



తోటపేటలో నారుమడిని పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: ఖరీఫ్‌లో రైతులు వరి నారుమడి యాజమాన్యం పాటించాలని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ సూచించారు. ఎకరానికి 5 సెంట్లలో నారుమడి సిద్ధం చేసుకోవాలన్నారు. నారుమడి వేసుకోవడానికి 10 రోజుల ముందుగా దమ్ము చేసుకుంటే గత పంట తాలూకా విత్తనాలు మొలవకుండా ఉంటాయన్నారు. విత్తనాలను సూడోమోనాస్‌తో కలిపి విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా తెగుళ్లను నిరోధించవచ్చన్నారు. నారుమడికి కిలో యూరియా, కిలో భాస్వరం, కిలో పొటాష్ చల్లుకోవాలన్నారు. విత్తిన 6 రోజుల వరకు నీరు పెడుతూ తీస్తూ ఉండాలన్నారు. 12 నుంచి 14 రోజులలో కిలో యూరియా చల్లుకోవాలన్నారు. నారుమడి 15 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 500 గ్రాములు వేసుకోవాలన్నారు. నారుమడిపై క్లోరిఫైరిపాస్ 300 మిల్లీలీటర్లు పిచికారీ చేసుకుంటే వరి కాండం తొలుచుకు పురుగు ఉధృతి అరికట్టవచ్చన్నారు. అదే విధంగా ఎర్రటి రంగు గల ఆకులు కనిపిస్తే జింకు లోపం ఉన్నట్లు గుర్తించి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మోటారు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 10 మంది దివ్యాంగులకు రూ.9.2 లక్షల విలువైన మూడు చక్రాల మోటారుసైకిళ్లను ఎమ్మెల్సీ తోట పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్‌పఠాన్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, ముక్కా దాలయ్య, పెంకే గంగాధర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు రుణం



కౌలు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్

రాయవరం: సాగు పెట్టుబడి కోసం దళారులు, వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా రైతులకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ అన్నారు. సోమేశ్వరంలో మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు కౌలు రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరిఫ్ మాట్లాడుతూ కౌలు రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ మాట్లాడుతూ ఐదుగురు కౌలు రైతుల వంతున గ్రూపులుగా ఏర్పాటు చేసి, ఎటువంటి హామీ లేకుండా రుణాలు అందించేందుకు సోమేశ్వరం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నామన్నారు. దళారులు వడ్డీ వ్యాపారుల దోపిడీకి గురికాకుండా రైతుల భూమితో కాని, రుణ అర్హతతో కాని సంబంధం లేకుండా సేద్యం పెట్టుబడికి రుణాలు అందించడమే పైలట్ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు. పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గరగ కామరాజు, వ్యవసాయ సహాయకులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అలనాటి స్మృతులు గుర్తుచేసుకుని..



మేఘాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ సంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆర్జేడీ నాగమణి, గ్రామస్తులు

కె.గంగవరం: తాను చదువుకున్న అద్దంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మేఘాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ, అభివృద్ధి కమిషనర్ పి.సంపత్‌కుమార్ బుధవారం సందడి చేశారు. అలనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. అదే స్కూల్‌లోనే పాఠాలు చెప్పిన ఆయన తల్లి రిటైర్డ్ టీచర్ ఈశ్వరమ్మతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. తన తల్లి ఈశ్వరమ్మ ఉపాధ్యాయురాలిగా పనిచేసిన సమయంలో తరగతులకు వచ్చిన విషయాన్ని ఆయన జ్ఞాప్తికి తెచ్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని స్వయంగా చూసేందుకు తాను తల్లి ఈశ్వరమ్మతో కలసి వచ్చినట్లు సంపత్‌కుమార్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి మాట్లాడుతూ ఉన్నత స్థానానికి ఎదిగిన సంపత్‌కుమార్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆర్జేడీ నాగమణి, గ్రామస్తులు కలసి ఈశ్వరమ్మ, సంపత్‌కుమార్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, వైస్ ఎంపీపీ దూడల చినబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కొప్పిశెట్టి నారాయణమూర్తి, డీవైఈఓ షాలెంరాజు, ఎంఈవోలు అలజంగి నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు, సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ముస్తాబైన మసీదులు
- నేడు త్యాగాల పర్వదినం



వెదురుపాకలో బక్రీద్‌కు ముస్తాబైన మసీదు

రాయవరం: ధనిక, పేద తారతమ్యం లేకుండా ప్రతి ముస్లిం జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది బక్రీద్. పవిత్ర త్యాగానికి ప్రతిరూపం దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని స్మరించుకునే పండగకు మండపేట నియోజకవర్గంలోని మసీదులు ముస్తాబయ్యాయి. రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యం ఉన్న ఈదుల్ జుహాన్‌ను త్యాగాల పండగ అని కూడా ముస్లింలు పిలుచుకుంటారు. ఈదుల్ ఫితర్ తరువాత రెండు నెలలకు ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల(జుల్ హజ్జా) 10వ రోజున బక్రీద్‌ను జరుపుకొంటారు. గురువారం బక్రీద్ నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. మండలంలో రాయవరం, వెదురుపాక, లొల్ల, పసలపూడి, చెల్లూరు తదితర గ్రామాలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మసీదుల్లో నమాజ్ అనంతరం ముస్లిం మత పెద్దలు సందేశాన్నిస్తారు. అనంతరం ఖుర్బాని పాటిస్తారు.

ఖుర్బాని ఇలా..

బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బాని ఇవ్వడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మరో భాగాన్ని బంధువులకు ఇచ్చి మూడో భాగాన్ని వారి కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బాని అంటారు.

మక్కాను సందర్శిస్తే ముక్తి



బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా పొట్టేలు మాంసాన్ని ఖుర్బాని ఇచ్చి పేదలకు పంచడం ఆనవాయితీ. అలాగే ముస్లింలు తమ జీవితంలో ఒక్కసారైనా అతి పవిత్రమైన మక్కాను సందర్శించి ముక్తిని పొందుతారు.
– షేక్ మస్తాన్ వలీ, ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు, పసలపూడి

చనిపోయిన వారిని గుర్తు చేసుకొని..



బక్రీద్ పండగ మనిషి దైవభీతిని, త్యాగ నిరతిని తెలుపుతుంది. అందుకే ఈ పండగను త్యాగాల పండగ అంటారు. చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బాని ఇవ్వడం ఈ పండగ ప్రత్యేకత.
– షేక్ అహమ్మద్ బాషా, మసీదు నిర్వాహకుడు, వెదురుపాక

గడప గడపకూ సంక్షేమమే లక్ష్యం

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



కుయ్యేరులో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదలకు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం కుయ్యేరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు చీకట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ఏ ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుయ్యేరులో గడిచిన ఏడాదికి గాను అమ్మ ఒడి పథకం ద్వారా రూ.1.98 కోట్లు, విద్యా దీవెన ద్వారా రూ.59.63 లక్షలు, జగనన్న తోడు రూ.8.20 లక్షలు, ఈబీసీ నేస్తం ద్వారా రూ.2.40 లక్షలు, వాహనమిత్ర ద్వారా రూ.55.80 లక్షలు, ఇలా అనేక పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు సొమ్ము జమ చేశారన్నారు. మండల ప్రజల చిరకాల కలగా మిగిలిన గొల్లపాలెం, కుయ్యేరు రహదారిని సీఆర్ఎఫ్ పథకం ద్వారా రూ.37 కోట్లతో డబుల్ రోడ్డుగా వెడల్పు చేసి పునర్నిర్మిస్తున్నామని అన్నారు. పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పేదరికాన్ని జయించడానికి ఏకైక ఆయుధం విద్య అని, అందుకే సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కుయ్యేరు ఓసీ పేట, మెయిన్ విలేజ్, రజక కాలనీలో మంత్రి పర్యటించగా.. శీలంవారిపేట, బీసీ కాలనీ తదితర ప్రాంతాలలో మంత్రి తనయుడు నరేన్, ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు తదితరులు ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, యాళ్ల సత్తిబాబు, దండంగి చిన్నారావు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కుయ్యేరు శివారు చింతలంక, రేగుబడవ గ్రామాల్లో గురువారం జరిగే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి జరిగే కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ నాయకులు గ్రామంలో పర్యటిస్తారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని వివరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- సోమేశ్వరంలో 'గడప గడపకూ'



సోమేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సోమేశ్వరంలో బుధవారం రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ఆరిఫ్, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావులతో కలిసి ఎమ్మెల్సీ తోట ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, వారి పొందిన లబ్ధిని తెలియ జేశారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ మేరకు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను త్రిమూర్తులు, సర్పంచ్ ఆరిఫ్‌లు ప్రారంభించారు. పలు చోట్ల ప్రజలు ఎమ్మెల్సీ త్రిమూర్తులు, వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్‌లకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణాదేవి, మండల కాపు సంఘం నేత నున్న వెంకటరమణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

- కౌన్సిల్ సమావేశంలో మంత్రి వేణు
- రూ.32.50 కోట్లతో 12 అంశాలకు ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇందులో భాగంగా పట్టణంలో రూ. 32.50 కోట్లతో పలు పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని అంశాలను సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాలరావు కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. మొదటి అంశంగా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన 6వ వార్డు కౌన్సిలర్ మేడిశెట్టి వెంకటలక్ష్మి రాజీనామాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. కాగా కౌన్సిలర్ రాజీనామాను తిరస్కరిస్తున్నట్లు చైర్ పర్సన్ శ్రీదేవి ప్రకటించారు. అనంతరం మిగిలిన 12 అంశాలపై వివిధ అభివృద్ధి పనుల టెండర్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశానికి ఎక్స్అఫీషియో సభ్యుడిగా హాజరైన మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ సీవేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్ ద్వారా పట్టణంలోని మురుగునీటిని స్వచ్ఛమైన నీటిగా మార్చి పంట పొలాలకు అందించే విధంగా ఎస్టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి రూ. 3.50 కోట్లు మంజూరైందన్నారు. 28 వార్డుల్లో ఉన్న చిన్న డ్రైన్లను రూ.16.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇంటింటికీ తాగునీటి సరఫరాలో భాగంగా పైప్‌లైన్లు లేని ప్రాంతాల్లో మరో రూ.12 కోట్లతో తాగునీటి సౌకర్యాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువల్లో పూడిక తీత పనులు సక్రమంగా నిర్వహించిన అధికారులు, కార్మికులను మంత్రి వేణు అభినందించారు. దీనిపై కౌన్సిలర్లు చప్పట్లతో అధికారులను అభినందించారు. పట్టణంలో వృథాగా ఉన్న పలు పార్కులను క్రీడా ప్రాంగణాలుగా మార్చేందుకు ప్రణాళికలు తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇచ్చిన మాట ప్రకారం గ్రీన్ రామచంద్రపురంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి విజ్ఞప్తి చేశారు. వార్డు పర్యటనలో భాగంగా బుధవారం కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మితో కలిసి 24వ వార్డులో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణపై స్థానికులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు తెలుసుకుని ప్రజలు తెలిపిన సమస్యలపై అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యలతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే పారిశుధ్య మెరుగుపడుతుందన్నారు. చెత్తను డ్రైన్లలోను, ఎక్కడపడితే అక్కడ వేయరాదని, తడి, పొడి చెత్తగా విభజించి చెత్త సేకరణకు వచ్చిన పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. వైస్ చైర్ పర్సన్ పిల్లి గణేశ్వరరావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు శెట్టి కళ్యాణి, అమలదాసు లక్ష్మి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, పార్టీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, అడబాల వీరబాబు, గిడుతూరి శివ, తుమ్మ శ్రీనివాస్, వెల్ల కేధరనాథ, అందనాపల్లి రవి, కొడమంచిలి భాస్కరరావు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.